

హర్ ఘర్ తిరంగా..
జిల్లాలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి జాతీయ జెండాలు అందించారు.
- 9లో ▸



బిచ్కుంద బల్దియా అయ్యేనా?
బిచ్కుంద గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలన్న ప్రజల ఆకాంక్ష తీర్మానాల దశ దాటడం లేదు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.1 /23.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు ముఖ్య అతిథిగా పటేల్ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం మంగళవారం సాయంత్రం విడుదల చేసింది. ముఖ్య అతిథిగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ప్రసంగం అనంతరం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానం తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

'దళిత బంధులో అవినీతిపై విచారణ జరపాలి'



నిజాంసాగర్: దళిత బంధు పథకం అమలులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో సమావేశమయ్యారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో దళిత బంధు పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హసన్‌పల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన పొదుపు డబ్బులను కాజేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌ఐపై సస్పెన్షన్ వేటు

పెద్దకొడప్‌గల్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పండరిని కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తున్నట్లు తహసీల్దార్ దశరథ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి జరుగుతుండగా వడ్లం గ్రామానికి చెందిన అంజయ్య అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టా మార్పిడి విషయంలో ఆర్‌ఐపై ఆరోపణలు చేశాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ పండరిని సస్పెండ్ చేశామని తహసీల్దార్ తెలిపారు.

'విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి'



లింగంపేట: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం ఆయన ఒంటర్‌పల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనోపకరణాలను ఉపయోగించి చదువు చెప్పాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచిగా ఉండేలా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు గిరిజనులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతితో కూడిన శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 70934 66985 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 4,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి 1,080.90(47.52 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందన్నారు. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

మాఫీ అయ్యేనా?

పంద్రాగస్టులోపు పంట రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి తొలుత రూ.లక్షలోపు రుణాలు, రెండో విడతలో రూ.లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేశారు. ఇక మూడో విడత ఈ నెల 15న జరగనుంది. ఈ నేపథ్యంలో రుణ మాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. తొలి, మలి విడతల్లో అవకాశం దక్కని రైతులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా మూడో విడత జాబితాలోనైనా తమ పేర్లు ఉంటాయన్న ఆశతో ఉన్నారు.



- రేపే ఆఖరు విడత రుణమాఫీ
- జిల్లాలో క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు 1.70 లక్షల మంది..
- రెండు విడతల్లో కలిపి 73,731 మందికే లబ్ధి
- ఆందోళనలో మిగతా రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తమ పంట రుణం మాఫీ అవుతుందని రైతులంతా భావించారు. అయితే ప్రభుత్వం రుణ మాఫీకి నిబంధనలు విధించడంతో చాలామంది అర్హత కోల్పోయారు. సాంకేతిక కారణాలతో మరి కొంత మందికి లబ్ధి చేకూరలేదు.

జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల ద్వారా రూ.1,458 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నారు. గత నెల 18న తొలి విడతలో లక్ష రూపాయలలోపు పంట రుణాన్ని మాఫీ చేశారు. జిల్లాలో 49,541 మందికి సంబంధించిన రూ.233.41 కోట్లు మాఫీ జాబితాలో ఉన్నాయి. అయితే ఇందులో 48,975 మంది రైతుల ఖాతాల్లో రూ.228.72 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. మిగతా 565 మంది రైతులకు సంబంధించి రూ. 2.41 కోట్లు వివిధ కారణాలతో జమ కాలేదు. వారంతా రుణమాఫీ అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే గత నెల 30న రెండో విడత రుణమాఫీ చేయగా.. జిల్లాలో 24,816 మంది రైతులకు సంబంధించిన రూ. 211.72 కోట్లు మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇందులోనూ వివిధ కారణాలతో 60 మంది రైతులకు సంబంధించి రూ.48 లక్షలు వారి ఖాతాల్లో జమ కాలేదు. రెండు విడతల్లో కలిపి దాదాపు 74 వేల మంది రైతులకు రూ.460 కోట్ల మేర మాఫీ జరిగింది. మూడో విడతలో ఎంత మందికి మాఫీ అవుతుందన్న దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

ఈసారైనా పేరుండేనా?

పంద్రాగస్టులోపు రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రెండు విడతల ప్రక్రియ పూర్తయ్యింది. గురువారం చివరి విడత రుణమాఫీ చేయనున్నారు. దీంతో రైతుల్లో ఆసక్తితో పాటు ఉత్కంఠ నెలకొంది. తొలి విడతలో దాదాపు యాభై వేల మందికి రుణమాఫీ కాగా.. రెండో విడతలో 24 వేలపైచిలుకు మందికి లబ్ధి చేకూరింది. చివరి విడతలో ఎంతమందికి రుణ విముక్తి అవుతుందన్న విషయమై స్పష్టత కరువైంది. వడ్డీలతో కలిపి రూ. 2 లక్షల రుణం ఉన్న వారు జిల్లాలో 12 వేల మంది వరకు ఉంటారని అంచనా. అయితే అందులో కట్ ఆఫ్ డేట్, ఇతర కారణాలతో ఎంత మందికి మాఫీ అవుతుందన్నది తేలాల్సి ఉంది. రూ. 1.50 లక్షలలోపు రుణమే ఉన్నా.. మొదటి రెండు విడతల్లో రుణమాఫీ కాని వారి వివరాలు చివరి జాబితాలో ఉంటాయా అన్న విషయమై అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కాగా తొలి, మలి విడతల్లో రుణమాఫీ పొందలేని రైతులు తమకు ఈ సారైనా న్యాయం జరుగుతుందన్న ఆశతో ఉన్నారు. జిల్లాలో సుమారు 60 శాతం మంది రైతులకు రుణ మాఫీ కాలేదు. న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

విజృంభిస్తున్న డెంగీ

- లక్ష్మీరావులపల్లిలో ఎనిమిది కేసులు
- ఆందోళనలో గ్రామస్తులు

మాచారెడ్డి: జిల్లాలో కొద్ది రోజులుగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఒక్క లక్ష్మీరావులపల్లి గ్రామంలోనే ఎనిమిది కేసులు నమోదయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో ఒకే ఇంట్లో ఇద్దరికి డెంగీ సోకింది. వారిని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. గ్రామంలో మరో ఆరుగురు సైతం డెంగీతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించుకుంటున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 54 మందికి వైద్య సేవలందించిన సిబ్బంది.. 17 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఆ నమూనాలను ల్యాబ్‌కు పంపించనున్నట్లు వైద్యాధికారి ఆదర్శ్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్, పీహెచ్‌ఎన్ సుశీల, ఎంఎల్హెచ్‌పీ వీణ, ఏఎన్‌ఎం స్వరూప, ఎల్టీ అరుణ, ఆశవర్కర్లు అన్నపూర్ణ, మానస, పద్మ పాల్గొన్నారు.



జ్వర పీడితుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- పార్టీని మరింత బలోపేతం చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాడ్వాయిలో మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు. ఫిర్యాదులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు.



నేతాజీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసి..

తాడ్వాయిలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాలను కడిగి శుభ్రం చేశారు. పంద్రాగస్టున ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు రవీందర్‌రెడ్డి, రవీందర్‌రావు, లింగారావు, వెంకట్‌రావు, నర్సారెడ్డి, యాదగిరి, రాజిరెడ్డి, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'అవయవ దానానికి ముందుకు రావాలి'

కామారెడ్డి టౌన్: అవయవ దానానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సూర్య ఆరోగ్య సంస్థ, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతికున్నప్పుడే కాకుండా మరణించిన తర్వాతా ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అవయవదానంతో ఇది సాధ్యమన్నారు. మనం జీవించి ఉన్నప్పుడు రక్తం, ఎముకల గుజ్జు, కిడ్నీ, కాలేయం మొదలైనవి దానం చేయవచ్చని, చనిపోయిన తర్వాత ఆరు గంటలలోపు అన్ని అవయవాల దానం ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేంద్రకుమార్, విక్రమ్, అమృత రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రాంసింగ్

ఎస్సీ హాస్టల్‌లో ఏసీబీ తనిఖీలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోటగల్లీలోగల ఎస్సీ మహిళా హాస్టల్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉదయం 6 గంటలకే చేరుకున్న అధికారులు 11 గంటల వరకు తనిఖీలు చేశారు. ఏసీబీ అధికారులతోపాటు ఫుడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, తూనికలు కొలతలు, ఆడిట్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా మాట్లాడారు. భోజనం అంతగా రుచిగా ఉండదని, కొన్ని సందర్భాల్లో తినకుండానే పారేస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న ఎనిమిది రిజిస్టర్‌లను ఆడిటర్ సంతోష్ పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో వర్షపునీరు నిలువడంతోపాటు మూత్రశాలలు శుభ్రంగా లేవని గుర్తించారు. మంచినీటి ట్యాంక్‌లను, వంటగదిని పరిశీలించి వంట మనుషులతో మాట్లాడారు. ఏసీపీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖ పరిధిలోని వివరాలను సేకరించారు. బియ్యం, పప్పులు, కారం, చింతపండు తదితర శాంపిళ్లను సేకరించిన అధికారులు.. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు, అలాగే తనిఖీ నివేదికను హైదరాబాద్‌లోని ఏసీబీ డీజీ కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. విచారణపై ఎస్సీ వెల్ఫేర్ కమిషనర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, తూనికలు కొలతల అధికారి ఎండీ సుజాత్ అలీ, బిల్లు ఆడిటర్ సంతోష్, ఏసీబీ సీఐలు నగేశ్, శ్రీనివాస్ తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు

సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలి



సీఎంఆర్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- లేకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకోండి
- పౌరసరఫరాల శాఖ అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీటీలు నిరంతరం మిల్లులను పర్యవేక్షించాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ ఇవ్వకపోతే రైస్ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో నిత్యానందం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌లు కిష్టయ్య, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

జరిమానాలు విధించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

జాతీయ రహదారి పక్కన చెత్త పోసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కలెక్టర్ సంగ్వాన్ మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. రామేశ్వర్‌పల్లి శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. 44 వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న పలు ఫంక్షన్ హాల్స్‌కు సంబంధించిన వ్యర్థ పదార్థాలను ఇక్కడ పడేస్తుండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. దీంతో వ్యర్థాలను రహదారి పక్కన పడేసే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆట వస్తువులను వినియోగంలోకి తేవాలి

పార్కులోని ఆట వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని రాజీవ్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో చెడిపోయిన ఆట వస్తువులను పరిశీలించారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. నడక దారిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పార్క్‌లో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించాలన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పార్కులో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించాలన్నారు. వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేయడానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

మాజీ డీసీవో సింహాచలం సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన సహకార శాఖ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ ఉదయ్‌కుమార్
- భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ
- సింహాచలం అవినీతిపై పలు కథనాలు ప్రచురించిన 'సాక్షి'

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా మాజీ సహకార అధికారి కె.సింహాచలంను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కోఆపరేటివ్ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ పి.ఉదయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సింహాచలం ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీసీబీ రికవరీ ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. ఆయన అవినీతి, అక్రమాలపై 'సాక్షి' పలు పరిశోధనాత్మక కథనాలను ప్రచురించింది. అలాగే ఈ వ్యవహారాలపై సుంకేట అన్వేష్ రెడ్డి, సోమశేఖర్ అనే రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విచారణ జరిపించింది. గత మార్చి 13న జాయింట్ రిజిస్ట్రార్ ప్రసన్న విచారణ జరిపారు. ఏప్రిల్ 25న ఆమె విచారణ నివేదికను ప్రభుత్వానికి అందించారు. దీంతో ప్రభుత్వం తాజాగా సింహాచలంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల కాపీని అందుకునేందుకు సింహాచలం అందుబాటులో లేకపోవడం గమనార్హం.



సింహాచలం (ఫైల్)

'సాక్షి' ప్రచురించిన కథనాల్లో అనేక అంశాలు..

సింహాచలం అవినీతి, అక్రమాలపై 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. సహకార సంఘాల చైర్మన్లను వేధింపులకు గురిచేయడం, అక్రమాలను నిలదీసిన సీఈవోలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెట్టడం, వారి వద్దనుంచి భారీగా వసూళ్లు చేయడం, సింహాచలం కారణంగా దివాలా తీసిన పలు సొసైటీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు సైతం డీసీవో ఖాతాల నుంచి చెల్లింపులు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఫర్టిలైజర్ కంపెనీలతో వ్యాపారం చేయడం, చెక్కులతో లావాదేవీలు చేయాల్సి ఉన్నప్పటికీ భారీగా నగదు డ్రా చేసిన వ్యవహారాలు, సొసైటీలకు వచ్చిన కమీషన్లను దండుకున్న వైనం, బైక్‌లపై వందల క్వింటాళ్ల ధాన్యం రవాణా చేసినట్లు దొంగ లెక్కలు చూపిన వైనం, పడగల్ సొసైటీలో 773 బస్తాలకు 100 బస్తాల కడ్తా తీయడం, బదిలీ అయినప్పటికీ రికార్డులను కొత్త డీసీవోకు అప్పగించకపోవడం, తన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా నుంచి నిపుణులను తీసుకొచ్చి రికార్డులను ట్యాంపరింగ్ చేయడం తదితర వ్యవహారాలపై కథనాలను 'సాక్షి' ప్రచురించింది. దీంతో సింహాచలంపై చర్యలు తీసుకోవాలంటూ నిజామాబాద్ డీసీసీబీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం సైతం చేయడం విశేషం.



సింహాచలం అవినీతిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాల క్లిప్పింగ్‌లు

'సర్వీస్ రూల్స్ సాధించడమే లక్ష్యం'



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ(తెలంగాణ) వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ సాధించడమే తమ యూనియన్ తదుపరి లక్ష్యమని పీఆర్‌టీయూ(తెలంగాణ) వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీఆర్‌టీయూ(తెలంగాణ) సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ సాధించడంతోపాటు ఉపాధ్యాయులకు రూ.5 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేసేలా తాను కృషి చేస్తానన్నారు. నాగిరెడ్డిపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని ఉపాధ్యాయినులు ఆయనకు రాఖీ కట్టారు. జీసీడీవో ఉమారాణితోపాటు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఇతర ఉపాధ్యాయినులు ఆయనకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



బాన్సువాడ : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మంగళవారం బాన్సువాడ బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఎమ్మెల్యే అనుచరులుగా ఉన్న కొందరు నేతలు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉండిపోయారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్న నేతలతో నిత్యం మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్‌లు ఫోన్‌లో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉన్న కేటీఆర్ నుంచి పిలుపు రావడంతో బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, మాజీ వార్డు మెంబర్ మోచీ గణేష్, దామరంచ మాజీ సర్పంచి సుధాకర్, సాయిబాబాలతో పాటు కార్యకర్తలు ఆయన్ని కలిసారు. బాన్సువాడలో ఉప ఎన్నిక ఖాయమని, బీఆర్‌ఎస్ పార్టీ పుంజుకునేలా చర్యలు తీసుకోవాలని, కేటీఆర్ సూచించినట్లు తెలిసింది. కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

లబ్ధిదారులకు నిధులు కేటాయించాలి



కామారెడ్డి క్రైం : దళిత బంధు 2వ విడతలో ఎంపికైన లబ్ధిదారులకు నిధులు కేటాయించాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం దళితబంధు లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ఇస్తామని చెప్పిన రూ.12 లక్షల వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి, రాజు, నర్సింలు, ధనరాజు, శంకర్ గంగాధర్ తదితరులున్నారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీడీ కాంగార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్ మాట్లాడుతూ రాజీనామాలు చేసిన బీడీ కార్మికులకు ఫారం ఐ ద్వారా పూర్తిగా సెటిల్‌మెంట్‌లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వర్క్‌షాప్



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. డేటా అనలిటిక్స్ అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ ఎగ్జిక్యూటివ్ సంస్థ ప్రతినిధులు సురేష్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పనికిరాని పల్లెప్రగతి పనులు

నిజాంసాగర్(జుక్కల్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలు ఖర్చుచేసిన చేపట్టిన పల్లె ప్రగతి పనులు ఎందుకూ పనికిరాకుండా పోయాయని మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో శ్మశాన వాటిక, డంపింగ్ యార్డును పరిశీలించారు. వీటిని వినియోగంలోకి తేవాలని అధికారులను కోరారు.

బ్యాంకుల్లో దళారులదే హవా

- లోన్లు రెన్యూవల్ చేయిస్తామంటూ అడ్డగోలుగా వసూళ్లు
- నష్టపోతున్న అమాయక రైతులు



బీబీపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ కార్యక్రమం చేపట్టింది. పేద రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో ఇటీవల రూ.లక్ష, రూ.1.50 లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. అయితే రుణమాఫీ, లోన్ రెన్యూవల్స్‌కు సంబంధించి కొంతమంది పైరవీకారులు అన్నీ తామే చూసుకుంటామని పేర్కొంటూ రైతులను మోసం చేస్తున్నారు. బ్యాంకర్లు సైతం నేరుగా రైతు బ్యాంక్‌కు వెళ్తే ఏ పని చేయట్లేదు. అదే దళారుల రైతుల పత్రాలు తీసుకొని వస్తే గప్‌చుప్‌గా పని చేసేస్తున్నారు. చివరకు దిక్కులేని స్థితిలో రైతులు ఈ దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో మెజార్టీ బ్యాంకుల్లో ఇదే తతంగం జరుగుతుంది.

బ్యాంకు తెరవగానే..

ఉదయం బ్యాంకు తెరవగానే ఆయా బ్యాంకు ప్రధాన శాఖల్లో బ్రోకర్లు రంగప్రవేశం చేస్తున్నారు. గ్రామాల్లో ముందుగానే రైతుల వద్ద పాసుపుస్తకాలు, ఇతర వివరాలు తీసుకొని కట్టకట్టుకొని వస్తున్నారు. నేరుగా బ్యాంకు అధికారులకు ఇవ్వ డంతో వారు పని కానిచ్చేస్తున్నారు. అయితే లైను లో నిలబడి వచ్చే రైతులకు మాత్రం చుక్కెదురవుతోంది. ఫలానా కాగితాలు, వివరాలు లేవంటూ బ్యాంకర్లు వెనక్కి పంపిస్తున్నారు. దీంతో రైతు ఉసూరుమంటూ వెళ్లి మళ్లీ దళారినే కలుస్తున్నారు. ఎంతో కొంత ముట్టజెప్పి పని చేయించుకుంటున్నారు.

కాలు కదపని బ్యాంకర్లు..

వాస్తవానికి బ్యాంకు అధికారులు రైతులకు పంట రుణాలు ఇచ్చే ముందు నేరుగా గ్రామానికి వెళ్లి వ్యవసాయక్షేత్రంలో ఏ పంట వేశాడో తెలుసుకొని పరిశీలించాలి. కాని క్షేత్రస్థాయిలో ఏ బ్యాంకులోనూ ఈ పరిస్థితి దాదాపుగా లేదు. రైతులకు ఎక్కువ రుణం కావాలంటే చాలు ఫలానా దళారిని సంప్రదిస్తే చాలు.. అనుకున్నంత లోన్ బ్యాంక్‌ను మంజూరవుతోంది. దీనికిగాను బ్రోకర్ రైతుల నుంచి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు.

ఎకరాల వారీగా కమీషన్లు

దళారీలు బ్యాంకుల్లో పనిచేయించినందుకు ఒక్కో రైతు నుంచి ఎకరాకు ఇంత అని వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు అధికారుల పేర్లు చెప్పి మరీ దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బ్యాంకుల్లో కూడా పైరవీకారులు తెచ్చిన పత్రాల పనులు త్వరితగతిన చేస్తున్నారు. దీంతో వారికి అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయేమోనన్న భావనతో రైతులు డబ్బులు వచ్చి పనిచేయించుకుంటున్నారు. బ్రోకర్లు రైతులతో ఖాళీ క్రెడిట్, డెబిట్ ఓచర్లపై సంతకాలు తీసుకుంటుండడంతో ఎంత విత్‌డ్రా చేస్తున్నారో, ఎంత జమ చేస్తున్నారో తెలియడం లేదు.

తక్కువగా రుణాలు ఇవ్వడంతోనే..

ప్రభుత్వం రుణాలు ఎంత మాఫీ చేసిందో రైతుకు అంతే రుణం తిరిగి బ్యాంకు అధికారులు మళ్లీ రైతులకు ఇవ్వాలి. కానీ బ్యాంకు అధికారులు అలా ఇవ్వడం కుదరదని రైతులకు తక్కువగా రుణాలు ఇస్తున్నారు.దీంతో రైతులు దళారులను ఆశ్రయించి వారికి ముడుపులు అప్పజెప్పితే వారు చెప్పినంత రుణాలను బ్యాంకు అధికారులు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

బంద్ ప్రశాంతం



ఎల్లారెడ్డిలో మూసి ఉన్న దుకాణాలు



జుక్కల్‌లో ర్యాలీ తీస్తున్న యువకులు

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా ఎల్లారెడ్డి పరిధిలోని ఆయా మండలాల్లో మంగళవారం బీజేపీ బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వీధుల్లో ర్యాలీలు తీశారు. – సాక్షి నెట్‌వర్క్



మద్నూర్‌లో మూసి ఉన్న దుకాణాలు



ఎల్లారెడ్డిలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో..

నిధులు రికవరీ చేస్తాం..



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధి హామీ పనుల్లో భాగంగా పెద్దకొడప్‌గల్ మండల పరిధిలో జరిగిన పనుల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగిందని తెలుస్తోందని ప్రతిఒక్క పైసా సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ వామన్ రావ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో ఉపాధిహామీ మూడో విడత సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 23 జీపీల్లో వివిధ పనులకు సంబంధించి రూ. 17కోట్లకు పైగా పనులు జరగగా వాటికి సంబంధించి ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ నుంచి సామాజిక తనిఖీ నిర్వహించారు. తీర్మానాలు లేకుండానే చాలాచోట్ల పనులు జరిగాయని, మేట్లకు సంబంధించిన వారికి, జీపీ సిబ్బందికి, ప్రభుత్వ ఉద్యోగులకు, వృద్ధులకు హాజరు వేసి లక్షల్లో నిధులు చెల్లించినట్లు తనిఖీల్లో వెల్లడైందన్నారు. కాస్లాబాద్‌లో ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవో, ఈసీ కలిసి చేపల పెంపకం లేకుండానే రూ. లక్షల్లో నిధులు కాజేసినట్లు విచారలో తెలిసిందన్నారు. కార్యక్రమంలో ఏవీవో ప్రశాంత్, ఎస్టీఎం వేణు, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీ కాంత్, మద్నూర్ ఎంపీడీవో రాణి తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



బాన్సువాడ రూరల్(బాన్సువాడ) : పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఆర్డీవో రమేశ్ రాథోడ్ ఆదేశించారు. మండలంలోని బుడిమి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆర్డీవో రమేశ్ రాథోడ్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

20న సబ్‌స్టేషన్‌కు భూమిపూజ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి మంజూరైన 33 /11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఈనెల 20న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహమ్మద్ నగర్‌లో సబ్‌స్టేషన్ స్థలానికి ట్రాన్స్‌కో అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ టెండర్ ప్రక్రియతో పాటు అగ్రిమెంట్ ప్రాసెస్ కారణంగా పనులు ఆలస్యం అయ్యాయన్నారు. ట్రాన్స్‌కో ఏడీ కన్‌స్ట్రక్షన్ శ్రీనివాస్, ఏఈ రమణారెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

పట్టణ మున్నూరు కాపు సంఘం ఎన్నిక

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదాం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొజ్జరవీందర్, కోశాధికారిగా పాశం స్వామీలను ఎన్నుకున్నారు. మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తామని వారు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సాయిలు, శంకర్, లక్ష్మినారాయణ, పట్టణంలోని మున్నూరు కాపు సంఘాల సభ్యులు ప్రతినిధులు పాల్గొన్నారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన స్కార్పియో



నాగిరెడ్డిపేట: మండల కేంద్ర సమీపంలో ఓ స్కార్పియో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న స్కార్పియో మండల కేంద్ర సమీపంలో ఎదురుగా ప్రయాణిస్తూ సడెన్‌గా ఆగిన బస్సును తప్పించే క్రమంలో ఎక్సెల్‌ను ఢీకొని పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ఉన్న లింగంపల్లికలాన్‌కు చెందిన వెంకటేశంకు గాయాలయ్యాయి. కాగా స్కార్పియోలో ఉన్న నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఆకతాయిలను పట్టుకుంటాం



సాక్షి ఎఫెక్ట్..

బీబీపేట : మండల కేంద్రానికి ఆమ్లేట్ గ్రామమైన రాంరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పేర్కొంటూ 'ఆకతాయిలకు అడ్డాగా అంగన్‌వాడీ కేంద్రం' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా స్థానిక పోలీసులు స్పందించారు. మంగళవారం ఉదయమే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి టీచర్ లతను వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం గ్రామస్తులంతా సమావేశం ఏర్పాటు చేసుకొని అంగన్‌వాడీలో అలాంటి కార్యకలాపాలు చేసేవారిని గుర్తించాలన్నారు. రాత్రివేళల్లో కేంద్రం దగ్గర కనిపిస్తే 100కు డయల్ చేయాలని పోలీసులు సూచించారు. పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ వారిని పట్టుకుంటామన్నారు.

డ్రెయినేజీలు శుభ్రం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలపై ఈనెల 12న 'బీసీ కాలనీలో సమస్యలెన్నో..' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీని అధికారులు స్పందించిదచి మురిక కాలువలు శుభ్రం చేయించారు. పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. దోమల మందును పిచికారి చేశారు. బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకు 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారులకు నిధులు కేటాయించాలి



కామారెడ్డి టౌన్ : దళితబంధు రెండవ విడతలో ఎంపికైన లబ్ధిదారులకు తక్షణమే నిధులు కేటాయించాలని దళిత సంఘాల నాయకులు, లబ్ధిదారులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అభయహస్తం పథకం కింద ఇస్తామని చెప్పిన రూ. 12 లక్షలను తక్షణమే అందజేయాలని కోరారు. స్వామి, రాజు, నర్సింలు, ధనరాజు ఉన్నారు.

పశువులకు టీకాలు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో పశువులకు పట్టణ పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొంతు వాపు జబ్బు టీకాలను ఇచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ వైద్యులు ఈట సంజయ్‌కుమార్ 86 గేదెలు, 23గోవులకు టీకాలను ఇచ్చిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రవీణ్‌గౌడ్, గోపాల మిత్రులు శ్రీనివాస్, బాలయ్య, బాబాగౌడ్, పాడి రైతులు పాల్గొన్నారు.

బస్సులు సకాలంలో నడపాలని ధర్నా

రాజంపేట : మండలంలోని ఆర్గొండలో బస్టాండ్ వద్ద కళాశాల విద్యార్థులు సకాలంలో బస్సులు నడపలని కోరుతూ ధర్నా చేపట్టారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండాపూర్, గుండారం గ్రామాలకు కళాశాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారని తమ గ్రామానికి సైతం కళాశాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బస్ కేటాయించాలని ఈ సందర్భంగా వారు కోరారు. బస్సు లేకపోవడంతో తాము సమయానికి పాఠశాలలకు సమయానికి వెళ్లలేక పోతున్నామన్నారు.

ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సట్టిగారి రవి రాజంపేట పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించి కామారెడ్డి డిపో మేనేజర్‌తో బస్సు వేయిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం: తల్లి మృతితో పాటు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మండడి భాషవ్వ(42) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి పిల్లలు లేరు. నాటి నుంచి పిట్లంలో ఉంటున్న తల్లి వద్దే ఉంటోంది. గతేడాది ఆమె తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి మృతితో పాటు ఆస్తమాతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఊరచెరువులో ఉదయం దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి అన్న గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



భరత్‌రెడ్డి(ఫైల్)

ఇందల్వాయి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎల్లరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఒంటరి భరత్‌రెడ్డి(25) ఏడాదిన్నర క్రితం రామడుగు గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. పదిహేను రోజుల క్రితం భరత్ గల్ఫ్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్న భార్య వద్దకు వెళ్లాడు. గతంలో సివిల్ కాంట్రాక్టర్ వద్ద పని చేసిన అనుభవం ఉండటంతో అక్కడే ఏదైనా ఉద్యోగం చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం మంగళవారం సాయంత్రం గ్రామానికి చేరుకోగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నీటికుంటలో పడి ఒకరి మృతి

బోధన్ రూరల్: మండలంలోని మినార్‌పల్లిలో మూడ్ పూల్‌సింగ్ (48) అనే వ్యక్తి నీటికుంటలో పడి మృతి చెందినట్లు బోదన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. పూల్‌సింగ్ సోమవారం రాత్రి కాలకత్యాల కోసం గ్రామ శివారులోని పొలాల వైపు వెళ్లగా మనోహర్‌రెడ్డి అనే రైతు పొలంలోని నీటి కుంటలో పడి మృతి చెందాడు. కుంటలో ఉదయం మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన సిరికంటి మహేశ్(35) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న మహేశ్ ఈ నెల 9న పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా కుటుంబీకులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మంగళవారం ఉదయం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య సిరికంటి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

లింగంపేట: ఎలుగుబంటి దాడిలో ఓ యువకుడిని గాయాలైన ఘటన మండలంలోని పొల్కంపేట లక్కీగాని తండా అటవీ శివారులో చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లంబాడి శ్రీనివాస్ మంగళవారం తన గేదెలను తీసుకొని రోజువారి లాగే అటవీ ప్రాంతానికి వెళ్లాడు. గేదెలు మేతమేస్తూ అడవిలోకి వెళ్లడంతో వాటిని వెతుక్కుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో ఎలుగుబంటి తల్లి, పిల్ల రెండు శ్రీనివాస్‌పై దాడికి యత్నించగా భయంతో అతను చెట్టుపైకి ఎక్కుతుండగా కుడికాలిని నోటితో పట్టి లాగడంతో తీవ్రగాయాలయ్యాయి. అతని వెంట కుక్కలు వాటిపై అరవడంతో అవి పారిపోయాయి. కొద్దిసేపటికి కిందికి దిగి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వెంటనే కామారెడ్డి అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం



అజయ్ కుమార్

రెంజల్: మండల కేంద్రానికి చెందిన అజయ్‌కుమార్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌లోని ఐటీఐలో సెకండియర్ చదువుతున్న అజయ్ ఈనెల 5న తన తండ్రి బైక్‌ని తీసుకొని కాలేజీకి వెళ్లాడు. నాటి నుంచి ఇంటి రాలేదు. దీంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రౌడీ షీటర్ రిమాండ్

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన రౌడీ షీటర్ అబ్బును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. గోషాల రోడ్డులోని వ్యాపారుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రూ. 10వేల జరిమానా

నవీపేట: మండలంలో ఇటీవల పట్టుబడిన మొరం టిప్పర్‌కు రూ. 10వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ నారాయణ మంగళవారం తెలిపారు. ఫతేనగర్ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నవీపేటకు చెందిన టిప్పర్ యజమాని అక్రమంగా మొరం తరలించారని పేర్కొన్నారు. ఫిర్యాదులు రావడంతో దాడి చేసి టిప్పర్‌ను పట్టుకుని జరిమానా విధించినట్లు వెల్లడించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- వడ్డీ వ్యాపారి వేధింపులే కారణమని సెల్ఫీ వీడియో
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీబాయి

కామారెడ్డి క్రైం: వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక జిల్లా కేంద్రంలోని ఓ మహిళా బిల్డర్ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన వాగుమారి లక్ష్మీబాయి దేవునిపల్లిలో బిల్డర్‌గా పనిచేస్తోంది. ఆమెకు భర్త లేడు. ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి పట్టణానికి చెందిన పాత విశ్వనాథం అనే వ్యాపారి వద్ద తన పేరిట ఉన్న ఇల్లు, ప్లాటును మార్ట్‌గేజ్ చేయించి రూ.32 లక్షల వరకు అప్పు తీసుకుంది. ఈ మధ్యనే అసలుతో పాటు వడ్డీ కలిపి చెల్లించినా ఇంకా రూ.66 లక్షలు అప్పు చూయిస్తున్నారని ఆమె తన సెల్ఫీ వీడియోలో రోదిస్తూ తెలిపింది. అదేంటని ప్రశ్నించినందుకు ఈ నెల 5న అతని బంధువులు ప్రదీప్, రాజశేఖర్, తేజతోపాటు మరో నలుగురు గుండాలను తీసుకువచ్చి దాడి చేశారని పేర్కొంది. అప్పు మొత్తం చెల్లించినా మార్ట్‌గేజ్ కింద రాయించుకున్న తన ఇల్లు, ప్లాటును తనకు తిరిగి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం లేదని వాపోయింది. సదరు వ్యాపారి వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోలో పేర్కొంది. తన మృతితోనైనా తన పిల్లలకు ఇల్లు, ప్లాట్లను ఇప్పించాలని ఎస్పీ సింధూశర్మను వేడుకుంటున్నట్లు సోమవారం రాత్రి వీడియో చేసి వాట్సాప్‌లో పలువురికి పంపింది. ఆ తర్వాత పురుగు మందు సేవించి ఆత్మహత్యకుయత్నించగా చుట్టూ పక్కల వారు గమనించి వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. సోమవారం సాయంత్రం ఆమె దేవునిపల్లి పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశ్వనాథంతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

టీటీడీ ఘాట్‌రోడ్‌లో ఆటోబోల్తా

బాన్సువాడ: బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం గుట్టపైకి భక్తులతో వెళ్తున్న ఓ ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న 8 మంది భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పుట్టిన రోజు వేడుకలను దేవస్థానంలో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిజామాబాద్ జిల్లా నవీపేట్ నుంచి 12మంది భక్తులతో కూడిన ఆటో మంగళవారం కొండపైకి ఎక్కుతుండగా బోల్తాపడింది. ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో పైకి వెళ్లే క్రమంలో కిందికి జారి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న 8 ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు బీర్కూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు నలుగురిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అందులో ఇద్దరి కాళ్లు విరిగినట్లు తెలిసింది.

ఇసుక లారీ పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శెట్లూర్, ఖద్గాం మంజీరా నుంచి లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గోపన్‌పల్లి గ్రామస్తులు మంగళవారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా శెట్లూర్, బిచ్కుందకు చెందిన వారు రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పట్టుకున్న లారీని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ సురేష్ జరిమానా విధించారు.

ఇసుక డంపుల స్వాధీనం

రుద్రూర్: పొతంగల్ మండలం కొడిచర్ల శివారులోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన మూడు ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మల్లేశ్ మంగళవారం పేర్కొన్నారు. సుమారు 25 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను బుధవారం వేలం నిర్వహిస్తామన్నారు. పొతంగల్ తహసీల్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, వేలంలో పాల్గొనే వారు రూ. ఐదు వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

పొతంగల్ శివారులో ఇసుక డంపులు మాయం

రుద్రూర్: పొతంగల్ శివారులోని మంజీరా బ్రిడ్జి సమీపంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులు మాయమయ్యాయి. అక్రమంగా ఇసుక డంపులు వేశారని విశ్వసనీయ సమాచారంతో 18 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను అధికారులు సీజ్ చేశారు. ఐతే మంగళవారం ఈ డంప్‌లను వేలం వేయాల్సి ఉంది. కానీ ఉదయం చూసేసరికి ఇసుక మాయమైంది.

ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన ఇసుక మాయం చేశారంటే వీరు ఎంతకు తెగించారో అర్థమవుతోంది. నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. బాధ్యులను గుర్తించి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.